
సాక్షి
జనగామ

బుధవారం | 17 | జూలై | 2024



'తొలిఏకాదశి'..సర్వశ్రేష్ఠం

ఆషాఢమాసంలో వచ్చే శుక్లపక్ష ఏకాదశిని 'తొలిఏకాదశి' అంటారు. నేడు శివ, వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. - 8లో▸



డీఎస్సీకి ఏర్పాట్లు పూర్తి

ఈ నెల 18 నుంచి నిర్వహించే డీఎస్సీ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
30^0 /24^0

వాతావరణం

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తొలి ఏకాదశి, మొహర్రం శుభాకాంక్షలు: కలెక్టర్



జనగామ: సమాజంలో ధర్మ పరిరక్షణ, ప్రజల్లో ఐక్యతకు మొహర్రం, తొలి ఏకాదశి చాటి చెబుతుందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్బాలా యుద్ధంలో విరోచిత పోరాటం గావించిన హజ్రత్ ఇమామ్ హుస్సేన్ ధైర్యం, నిబద్ధత ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. ముస్లింలు, హిందువులు కలిసి నిర్వహించే పీరీల ఊరేగింపు సమైక్యతను ప్రతిబింభిస్తుందన్నారు. తెలుగు పండుగలకు తొలి ఏకాదశి ఆది పండుగన్నారు. ఈ పర్వదినాన్ని ప్రజలంతా అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కలెక్టర్ జిల్లా ప్రజలకు మొహర్రం, తొలి ఏకాదశి పండగ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తములకు ప్రశంసపత్రాలు



జనగామ: నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (ఎన్‌పీడీసీఎల్) జనగామ సర్కిల్‌లో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు ప్రశంస పత్రాలు అందించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సర్కిల్ కార్యాయలంలో ఎస్ఈ వేణుమాధవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీజీఎం, కమర్షియల్ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్ సదర్ లాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జనగామ సర్కిల్‌లో 20 సెక్షన్లు పని చేస్తుండగా, బచ్చన్నపేట అత్యుత్తమ ప్రదర్శనకు గాను ప్రథమ స్థానం, ఉత్తమ ఇంప్రూవర్ కేటగిరీలో స్టేషన్‌ఘన్‌పూర్ ప్రథమ స్థానాల్లో నిలిచాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి కృషి, ప ట్టుదలతో పని చేయడంతోనే సీఎండీ ప్రశంసలు అందుకున్నారన్నారు. బచ్చన్నపేట ఏఈ జి.రాజ్‌కుమార్, స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ ఏఈ చంద్రమోహన్‌కు సదర్‌లాల్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందించారు. అనంతరం ఆర్ టీడీఏఎస్ ఫీడర్లు, పట్టణ ఫీడర్‌ను ఆయన పరిశీలించారు.

వివాదాస్పద స్థల పరిశీలన



చిల్పూరు: కమ్యూనిటీ భవనం నిర్మాణ విషయంలో గొడవలు పడొద్దని గ్రామ పంచాయతీ సభ తీర్మాణంలో ఎవరికి వర్తింపజేస్తే వారే నిర్మించుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న అన్నారు. మండలంలోని కృష్ణాజీగూడెంలో గ్రామంలో మహిళా సంఘాలు, ఎస్సీలకు మధ్య ఇటీవల స్థల వివాదం జరుగుతోంది. ఈ విషయంలో ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ ఆర్డీఓ, తహసీల్దార్‌లకు ఇరువర్గాల వారు స్వయంగా కలిసి స్థల వివాదం గురించి వినతి పత్రాలు అందజేశారు. ఈ విషయంపై మంగళవారం ఆర్డీఓ వెంకన్న, ఇన్‌చార్జ్ తహసీల్దార్ విమల, ఆర్ఐ శ్రీనివాస్‌లు వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకరికి కేటాయించిన స్థలంలోకి ఒకరు రావడం మంచిదికాదని, త్వరలో గ్రామ సభ ఏర్పాటు చేసుకుని సభలో నిర్ణయించిన ప్రకారం భవన నిర్మాణం చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొరిపెల్లి మల్లారెడ్డి, సాదం బీమయ్య, సాదం శ్రీనివాస్, ఊరడి రాములు, మచ్చ మల్లేషం, సాదం రాజేందర్, ఎర్రబెల్లి చేరాలు, ఇసాక్ తదితరులు ఉన్నారు.

బెస్ట్ అవైలబుల్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్: బెస్ట్ అవైలబుల్ పథకం కింద షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ సంక్షేమాధికారి దయానంద రాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 3వ విడత బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 5వ తరగతిలో 19 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు..

జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు డీఈఓ కె.రాము మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల నుంచి విద్యాశాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తుందన్నారు. ఈనెల 18వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పంపించాలన్నారు. ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సోలార్ యూనిట్లపై 'గృహజ్యోతి' ఎఫెక్ట్

- సబ్సిడీ ఇస్తామన్నా.. ముందుకు రాని మహిళలు
- ఆదర్శ గ్రామాల్లోనూ అమలు కాని వైనం



లింగాలఘణపురం: విద్యుత్ ఉత్పత్తిలో తరిగిపోతున్న వనరులను కాపాడుకోవడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ ఖర్చుల భారం తగ్గించుకునేందుకు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు సబ్సిడీతో కూడిన సోలార్ (సౌర) విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు గతేడాది ప్ర భుత్వం శ్రీకారం చుట్టింది. ముందుగా ఆదర్శ గ్రా మాల్లోని మహిళా సంఘాల సభ్యులను చైతన్యం చేసి సౌర యూనిట్లను ఏర్పాటు చేసి ఆదర్శంగా ఉండేందుకు జిల్లాలో లింగాలఘణపురం మండలం నెల్లుట్ల, దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెంలను పైలెట్ ప్రాజెక్టు గ్రామాలుగా ఎంపిక చేశారు. అందులో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ కూడా ఇచ్చారు.

ఏర్పాటు ఇలా..

సుమారు 160 నుంచి 200 చదరపు అడుగుల విస్తీర్ణంలో స్లాబు కలిగి ఉంటే 2 నుంచి 3 కిలో వాట్ల సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకొని తమ ఇంటి అవసరాలకు పోగా మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా టీజీఎన్‌పీడీఎల్ అనుమతితో టీఎస్‌రెడ్‌కో ద్వారా ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు.

స్త్రీనిధి నియమ నిబంధనలు

సోలార్ యూనిట్ల ఏర్పాటుకు స్వయం సహాయక సంఘాలకు స్త్రీనిధి రుణాలతో పాటు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కూడా అందజేస్తుంది. ఈ రుణాలన్నీ స్త్రీనిధి నియమ నిబంధనలతో వడ్డీ 11 శాతంతో 60 నెలల్లో చెల్లించే విధంగా రూపొందించారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లోనే ఇంత వరకు మొదలు కాలేదు.

'గృహజ్యోతి'తో సౌర విద్యుత్‌కు దెబ్బ..

ప్రభుత్వం అధికారంలోనికి రాగానే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందజేయడంతో సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ఎవరు ముందుకు రావడం లేదు. అసలు ఈ పథకంపై అధికారులు కూడా దృష్టి పెట్టడంలేదు. ఇక గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులను ప్రశ్నిస్తే ఎందుకు మాకు ఉచితంగా కరెంట్ ఇస్తుంటే ఇంకా సోలార్ యూనిట్లను ఎందుకు ఏర్పాటు చేసుకోవాలని చెబుతున్నారు.

సబ్సిడీ ఇలా			
కేవీ	విలువ (రూపాయల్లో)	సబ్సిడీ	స్త్రీనిధి రుణం
1	83,700	14,558	70,000
2	1,44,000	29,178	1,15,000
3	2,06,400	43,764	1,60,000

'గృహజ్యోతి' ఉందిగా..



ప్రభుత్వం గృహ జ్యోతి పథకంలో భాగంగా ఉచిత విద్యుత్‌ను అందిస్తుంటే సోలార్ యూనిట్లను ఎక్కడ ఏర్పాటు చేసుకుంటాం. సబ్సిడీ, స్త్రీనిధి రుణాలు ఇచ్చినా.. సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకోం. ఒకవేళ ఏర్పాటు చేసుకుంటే అవి ఎలా ఉంటాయో ఏమో. తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించాలంటే ఎట్లా..?

\- దేవర బుచ్చమ్మ, నెల్లుట్ల

సబ్సిడీ పెంచే యోచనలో ప్రభుత్వం



సోలార్ యూనిట్ల ఏర్పాటుకు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లో ఎవరూ ఏర్పాటు చేసుకోలేదు. గతంలో అవగాహన కల్పించాం. ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో ముందుకు రావడంలేదు. ప్రభుత్వం సబ్సిడీ పెంచే ఆలోచనలో ఉంది. ఎక్కువ సబ్సిడీ వస్తే అప్పుడైన ఏర్పాటు చేసుకొనే విధంగా మహిళలకు అవగాహన కల్పిస్తాం.

\- నిర్మల, స్త్రీనిధి జిల్లా రీజినల్ మేనేజర్

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పల్లెబాట

- ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

దేవరుప్పుల: స్థానిక సంస్థల పరిపాలన ముగిసి ప్రజాప్రతినిధులు లేనందున పల్లెల్లో పేరుకుపోతున్న సమస్యల పరిష్కారం కోసమే పల్లెబాట కార్యక్రమం చేపడుతున్నట్లు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని కోలుకొండలో తలపెట్టిన పల్లెబాట కార్యక్రమానికి పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు అధ్యక్షతన జరగగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం మాదిరి కాకుండా ఇంటింటా సంక్షేమ పథకాలు అందేలా సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో చేపట్టిన ప్రజా పాలన చారిత్రాత్మకంగా నిలుస్తున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను నేరుగా పరిశీలించి పరిష్కారం మార్గం చూపేందుకు నియోజకవర్గ అంతట పర్యటిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల్లో తిరుగుతూ, అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన చేసి, ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పనులను తనిఖీ చేశారు. నియోజకవర్గ యువజన నాయకుడు దామెర అనిల్ కుమార్, మండల ప్రత్యేక అధికారి, డీఈఓ రాము, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, నవీన్ కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పెద్దులు, మాజీ ఎంపీటీసీ దామెర రమ, మాలతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: బొగత జలపాతం



బొగత.. ఫిదా

సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం కనువిందు చేస్తోంది. మంగళవారం కొద్దిమంది పర్యాటకులు వచ్చినప్పటికీ జలపాతం అందాలకు ఫిదా అయ్యారు. పాలనురగలా జాలువారుతున్న నీటి పరవళ్లతో నిండుగా కనిపిస్తుండడంతో వీక్షకులు ఫొటోలు తీసుకున్నారు.

\- వాజేడు

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- మహిళా శక్తి కార్యక్రమాలపై సెర్ప్ అధికారులతో సమీక్ష
- డీపీఎంలు, ఏపీఎంలు, సీసీల పనితీరుపై అసంతృప్తి



డీపీఎంకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పక్కన ఎంపీ కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్: అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మహిళా శక్తి కార్యక్రమాల అమలుపై సెర్ప్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమీక్ష కార్యక్రమాన్ని శివునిపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించారు. డీఆర్‌డీఓ మొగులప్ప అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ముందుగా డీపీఎంలు తమ నివేదికను సమర్పించారు. డీపీఎం సమ్మక్క వీఓఏల పని తీరుపై ఏ,బీ,సీ,డీ గ్రేడులు ఉంటాయని, జఫర్‌గఢ్ మండలంలో గ్రేడ్‌ల గురించి చెపుతుండగా జఫర్‌గఢ్ మండలంలో అధికంగా బీ, సీ, డీ గ్రేడులు ఎందుకు ఉన్నాయని ఎమ్మెల్యే కడియం ప్రశ్నించారు. ఎస్‌హెచ్‌జీలు, వీఓఏల పనితీరుపై డీపీఎం, ఏపీఎం, సీసీల పర్యవేక్షణ లేదా, అధిక సంఘాలు ఎందుకు బీ, ఏ గ్రేడ్‌లో లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పనితీరు బాగా లేదని, మెరుగు పర్చుకోవాలని డీపీఎం, ఏపీఎం, సీసీలను ఆదేశించారు. వీఓఏల వేతనం పెంపు, ఎస్‌హెచ్‌జీలకు అందించే రుణాలకు సబ్సిడీ తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. నియోజవకర్గంలోని ఏడు మండలాల్లో మహిళా సమాఖ్య భవనాల నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని, ఇంప్రూవ్‌మెంట్ లేకపోతే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మహిళల అభివృద్ధితోనే దేశ పురోగతి సాధ్యమన్నారు. మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓలు శ్రీనివాస్, సుధీర్, ఏసీపీ భీమ్‌శర్మ, స్వర్ణ విజయ మండల సమాఖ్య అధ్యక్షురాలు మాచర్ల స్రవంతి, ఘన్‌పూర్ ఏపీఎం కుమార్ పాల్గొన్నారు.

రుణమాఫీ అర్హుల జాబితా సిద్ధం!

- నేడు అధికారికంగా తెలిసే అవకాశం
- రూ.1,450 కోట్ల వరకు పంట రుణాలు..?
- మొదటి ప్రాధాన్యత పీఎం కిసాన్ లబ్ధిదారులకేనా?
- జిల్లాలో 1.80 లక్షల మంది రైతులు



సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సదస్సులో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా(మధ్యలో)

జనగామ: తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీ కోసం చేపట్టిన కసరత్తు చివరి దశకు చేరుకుంది. జిల్లాల వారీగా రుణం పొందిన రైతుల వివరాలతో కూడిన తుది నివేదికలో లెక్క తేలనుంది. అర్హత కలిగిన రైతుల జాబితాను నేడు (బుధవారం) విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎంపీ, ఏఐసీసీ అధినేత 2022 మే 6వ తేదీన వరంగల్‌లో జరిగిన రైతు డిక్లరేషన్ సభలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించగా, సీఎం రేవంత్ రెడ్డి హామీని నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నాడు.

రూ.1,450 కోట్ల రుణ మాఫీ?

2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు ఐదేళ్ల కాలంలో రైతులు తీసుకున్న రూ.2 లక్షల వరకు రుణాన్ని ఒకే విడతలో మాఫీ కానుంది. జిల్లాలో 1.80లక్షల మంది రైతులు పెట్టుబడి సాయం, 87,600 మంది పీఎం కిసాన్ సాయం పొందుతున్నారు. ఇందులో ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్‌లో ప్రధాన బ్యాంకులతో పాటు 60 వరకు బ్రాంచ్‌ల పరిధిలో 1.40 లక్షల మంది రైతులు రుణం పొందినట్లు సమాచారం. ఇందులో ప్రాథమిక సహకార సంఘాలు, ప్రాంతీయ గ్రామీణ, జిల్లా సహకార కేంద్ర తదితర బ్యాంకుల పరిధిలో రుణాలు తీసుకున్న రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తింస్తుందని తెలుస్తుండగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా జిల్లాలో రైతులు ఆయా బ్యాంకుల్లో రూ.1,450 కోట్ల మేర పంట రుణాలు తీసుకున్నట్లు ప్రాథమిక అంచనా.

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి రైతులకేనా..

రూ.2 లక్షల రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్న రైతులకు తీపి కబురు అందించిన ప్రభుత్వం.. పూర్తి క్లారిటీ ఇవ్వడం లేదు. రుణ మాఫీ కోసం కలెక్టర్ నేతృత్వంలో ప్రతీ బ్యాంకులో నోడల్ అధికారిని నియమించిన సర్కారు పక్కా సమాచారం సేకరిస్తుంది. జిల్లాలో 1,61,147 రేషన్ కార్డులు ఉన్నాయి. రేషన్ కార్డు ప్రామాణికంగా రుణం మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కేంద్రం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా కుటుంబంలో ఒక్కరికి మాత్రమే పెట్టుబడి సాయం అందిస్తున్న క్రమంలో మొదటి దఫాలో రుణ మాఫీ కూడా ఈ రైతులకు ఇవ్వాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యం. కాగా రేషన్ కార్డు, పీఎం కిసాన్ సమ్మాన్ నిధితో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ వరకు రుణం తీసుకున్న ప్రతీ రైతుకు వర్తింప జేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఆదేశాలు రాగానే..

రుణ మాఫీ విషయమై జిల్లాకు సంబంధించి ప్రభుత్వం నుంచి పూర్తి సమాచారం వచ్చిన వెంటనే వివరాలను వెల్లడిస్తాం. హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో అభివృద్ధి పథకాల అమలు గురించి చర్చించడం జరిగింది. జిల్లాలో రుణమాఫీకి అర్హత కలిగిన రైతులు, నిధులు ఎంత అనే విషయం నేడు (బుధవారం) తెలిసే అవకాశం ఉంది.

\- రిజ్వాన్ బాషా, కలెక్టర్

ముగిసిన ఉద్యోగుల సాధారణ బదిలీలు

- ఆర్డర్ కాపీలు అందగానే బాధ్యతల స్వీకరణ



కౌన్సెలింగ్‌కు హాజరైన పంచాయతీ కార్యదర్శులు

జనగామ: జిల్లాలో సాధారణ బదిలీల ప్రక్రియ ముగిసింది. శాఖల వారీగా బదిలీలు.. పోస్టింగ్‌లను కేటాయించిన అధికారులు.. డిపార్ట్‌మెంట్ల వారీగా ఆర్డర్ కాపీలు ఇవ్వాల్సి ఉంది. 16 శాఖల పరిధిలో జిల్లా స్థాయి కేడర్‌కు సంబంధించిన జూనియర్ అసిస్టెంట్లు, ఓఎస్, మెసెంటర్, కామెటి, వంట, ఎల్‌డీ కంప్యూటర్, ఎంఎన్ఓ, పంచాయతీ సెక్రటరీ(సీనియర్/జూనియర్), ఫైర్ మెన్, సూపర్‌వైజర్లు, జేఎంఎస్, సీనియర్ అసిస్టెంటు, టైపిస్టు, చైన్‌మెన్, వాచ్‌మెన్ తదితర కేటగిరీలకు సంబంధించి నాలుగు, రెండేళ్ల పాటు ఒకే చోట పని చేస్తున్న ఉద్యోగులు బదిలీల కోసం ఆప్షన్ పెట్టుకున్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి బదిలీలు, పోస్టింగ్‌ల కేటాయింపులకు సంబంధించి కలెక్టరేట్ సమావేశం హాలులో ప్రక్రియ కొనసాగగా, మంగళవారం ముగిసింది. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాష ఆదేశాల మేరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ నేతృత్వంలో జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ అనిల్ కుమార్, కలెక్టరేట్ ఏఓ రవీందర్, డీఈఓ రామ్, ఇతర శాఖల ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా కేడర్‌కు సంబంధించి 12 మండలాల పరిధిలో 788 మంది ఉద్యోగులు ఉండగా, 256 మంది బదిలీలకు ఆప్షన్ ఇచ్చారు. ఈ నెల 15వ తేదీన 129 మంది ఉద్యోగులకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించగా, జిల్లా కేడర్‌లో పని చేస్తున్న 74 మంది జూనియర్, సీనియర్ పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ ముగియగా.. ఇక ఆర్డర్లు ఇవ్వడం మిగిలిపోయింది. బదిలీలతో ఆయా శాఖల్లో పరిపాలన పరంగా సేవలు కొంత మేర స్తంభించి పోగా.. నేటి నుంచి తిరిగి మళ్లీ పట్టాలు ఎక్కనుంది.

ఆర్డర్ కాపీలకు రంగం సిద్ధం

జిల్లాలో 16 శాఖల పరిధిలో జిల్లా కేడర్‌లో పని చేస్తున్న 203 మంది బదిలీల పర్వం ముగిసింది. ప్రస్తుతం పని చేస్తున్న శాఖ నుంచి మరో చోటకు బదిలీ కాగా, పోస్టింగ్ ఆర్డర్‌లు ఇవ్వాల్సి ఉంది. ఆయా శాఖలకు సంబంధించి జిల్లా అధికారుల నుంచి ఆర్డర్లు జారీ చేసిన వెంటనే.. బదిలీ చేయబడిన వారు బాధ్యతలు తీసుకోవాల్సి ఉంటుంది.

బ్యాంకు ఖాతా నుంచి రూ.96వేలు మాయం

స్టేషన్‌ఘన్‌పూర్: సెల్‌ఫోన్‌లో వచ్చిన వాట్సాప్ లింక్‌ను క్లిక్ చేయడంతో మండలంలోని తాటికొండకు చెందిన పోకల రాజేష్‌కు చెందిన బ్యాంకు ఖాతా నుంచి రూ.96వేలు మాయమైన సంఘటన నెల రోజుల క్రితం జరుగగా బాధితుడు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన పోకల రాజేష్ సెల్‌ఫోన్‌కు గత నెల 15న వాట్సాప్ ద్వారా టెలిగ్రామ్ యాప్ లింక్ రావడంతో దానిపై క్లిక్ చేయగానే మొదట తన ఎస్‌బీఐ బ్యాంకు ఖాతా నుంచి కొంత డబ్బు పోయింది. అదేరోజు గంట వ్యవధిలోనే మూడు సార్లు అతని ఖాతా నుంచి మొత్తం రూ.96 వేలు కట్ అయ్యాయి. మోసాన్ని గుర్తించిన బాధితుడు బ్యాంకు కస్టమర్ కేర్ నంబర్‌కు ఫోన్ చేసి విషయం తెలుపగా అతడి అకౌంట్‌ను ఫ్రీజ్ చేశారు. అనంతరం సైబర్ క్రైమ్ వారిని సంప్రదించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో చేసేదేమి లేక బాధితుడు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ముస్క రాజు తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

జనగామ: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు, బాలికలకు కల్పిస్తున్న చట్టాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని డీడబ్ల్యూఓ జయంతి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ విభాగం, పోలీస్, న్యాయ శాఖ సభ్యులతో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బేటి బచావో బేటి పడావో పథకం ద్వారా ఆడపిల్లలకు కల్పిస్తున్న భద్రత, సంరక్షణ గురించి వివరించినట్లు చెప్పారు. అత్యవసర సమయంలో మహిళా హెల్ప్ లైన్ నంబర్-181, చైల్డ్ హెల్ప్ లైన్-1098ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలాంటి సమయంలోనైనా ఆయా నంబర్‌లకు కాల్ చేయవచ్చన్నారు. అంతకు ముందు చట్టాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి రవికాంత్, మహిళా ఎస్సై శ్వేత, న్యాయవాది స్వప్న, సఖి సెంటర్ అడ్మిన్ రేణుక, డీహెచ్ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ పవిత్ర, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

జనగామ రూరల్: సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు హైదరాబాద్‌లో ఇచ్చే ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల గడువు పెంచినట్లు ఎస్సీ సంక్షేమాధికారి దయానందరాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులు డిగ్రీ అర్హత ఉండి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3లోపు ఉండాలన్నారు. ఆసక్తి గల వారు టీజీస్టడీసర్కిల్ వెబ్‌సైట్‌లో జూలై 31 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని, అందులో అర్హత సాధిస్తే 10 నెలల పాటు ఉచిత శిక్షణ వసతి, భోజన సదుపాయాలు ఉంటాయన్నారు.

పట్టణంలో పచ్చదనం పెంచుదాం



మొక్క నాటి నీరు పోస్తున్న అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, పక్కన జమున

జనగామ: పట్టణంలో మరింత పచ్చదనం పెరిగేలా ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ అన్నారు. వన మహోత్సవం పురస్కరించుకుని మంగళవారం జనగామ మున్సిపల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, కమిషనర్ వెంకటేశ్వర్లతో కలిసి అదనపు కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని, ప్రాణకోటికి జీవనాధారమైన మొక్కలను నాటి, సంరక్షించుకుంటేనే భవిష్య త్‌కు మనుగడ ఉంటుందన్నారు. ప్రతీ ఇంటికి మొక్కలను పంపిణీ చేస్తూ, వాటిని నాటే విధంగా కుటుంబ యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, కౌన్సిలర్ గాదెపాక రాంచందర్, గుర్రం భూలక్ష్మినాగరాజు, బాల్దె కమలమ్మ, ఆంజనేయులు, ఏఈ మహిపాల్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మల్లిగారి మధు ఉన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

- డీఎంహెచ్ఓ హరీష్‌రాజ్



వైద్యులకు సూచనలు ఇస్తున్న డీఎంహెచ్ఓ హరీష్‌రాజ్

స్టేషన్‌ఘన్‌పూర్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ హరీష్‌రాజ్ అన్నారు. డివిజన్‌కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని డీఎంహెచ్ఓ డాక్టర్ హరీష్‌రాజ్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రి పరిసరాలు, రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడారు. సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడి వచ్చే రోగులకు సరైన సౌకర్యాలు ఉండాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. అందరూ బాధ్యతగా పనిచేస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ వీరాంజనేయులు, డాక్టర్ జనార్దన్ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత కేసులో ఒకరికి పదేళ్ల జైలు

మహబూబాబాద్ రూరల్ : గంజాయి పట్టివేత కేసులో ఒకరికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ మంగళవారం తీర్పు వెలువరించారు. కోర్టు డ్యూటీ అధికారి దేవానాయక్ కథనం ప్రకారం.. కేసముద్రం ఎస్సై తిరుపతి, ఏఎస్సై కృష్ణమూర్తి, పీసీలు సత్యనారాయణ, వెంకన్న గతేడాది అక్టోబర్ 16వ తేదీన వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో కేసముద్రం స్టేషన్ సెంటర్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించారు. అతడి దగ్గర ఉన్న రెండు బ్యాగుల్లో 8 ప్యాకెట్లలో 16 కిలోల 290 గ్రాముల ఎండు గంజాయి లభించగా స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్ తరలించారు. పట్టుబడిన వ్యక్తి ఒడిశాలోని గజం జిల్లా షేర్ గడ గ్రామానికి చెందిన రంజిత కుమార్ ప్రధాన్ గా గుర్తించి కేసు నమోదు చేశారు. అప్పటి రూరల్ సీఐ బి.రమేశ్ విచారణ జరిపి అనంతరం బదిలీ కాగా ప్రస్తుత రూరల్ సీఐ పి.సర్వయ్య కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన కోర్టులో జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలుకమారి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించగా డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య, ప్రస్తుత కేసముద్రం ఎస్సై వంశీధర్ ఆధ్వర్యంలో సీడీఓ దేవానాయక్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలువిన్న జిల్లా జడ్జి చంద్రశేఖరప్రసాద్ నేరం నిరూపణకాబడిన రంజిత కుమార్ ప్రధాన్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. గంజాయి రవాణా చేస్తే కఠిన శిక్షలు తప్పవని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పేర్కొన్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

వరంగల్ లీగల్ : అనుమానంతో భార్యను హత్య చేసిన ఘటనలో రాయపర్తి మండలం కొలాన్‌పల్లి గ్రామం జయరాం తండాకు చెందిన నేరస్తుడు లావుడ్యా శ్రీనుకు జీవిత ఖైదు, రూ. 4వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్మలగీతాంబ మంగళవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కథనం ప్రకారం.. కొలాన్‌పల్లి గ్రామం బండకింది తండాకు చెందిన భూక్య గోపాల్ కుమార్తె రమను జయరాంతండాకు చెందిన లావుడ్యా శ్రీనుకు ఇచ్చి 2004లో వివాహం చేశారు. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అప్పటి వరకు బాగానే ఉన్న శ్రీను.. మద్యానికి అలవాటు పడి భార్యను అనుమానించి వేధింపులకు గురి చేసేవాడు. ఈ విషయం రమ తన తల్లిదండ్రులకు తెలుపగా పలుమార్లు పంచాయితీలు నిర్వహించారు. పెద్దల సమక్షంలో తన తప్పు ఒప్పుకుని, భార్యాపిల్లలను తీసుకుని వెళ్లేవాడు. అయినా శ్రీను ప్రవర్తనలో మార్పు లేదు. శ్రీను హింస భరించలేని రమ..2016, ఏప్రిల్ 22న వరంగల్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో 2016, జూలై 1న చేనులో పత్తిగింజలు పెట్టడానికి వ్యవసాయ భూమి వద్దకు శ్రీను తన భార్యను తీసుకెళ్లాడు. మరుసటి రోజు కూడా పని ఉందని చేను వద్దకు తీసుకెళ్లాడు. 2016, జూలై 2న మధ్యాహ్నం 3 గంటలకు జయరాం తండాకు చెందిన ఓ వ్యక్తి ఫోన్ చేసి రమపై శ్రీను కిరోసిన్ పోసి అంటించాడని చెప్పగా రమ తల్లిదండ్రులు కూతురు ఇంటికి వెళ్లారు. అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం తరలించారు. జరిగిన విషయం కూతురు రమను అడగగా కిరోసిన్ పోసి అంటించాడని తెలిపింది. చికిత్స పొందుతూ మూడు రోజుల తర్వాత రమ మృతి చెందింది. మృతురాలి తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు.. నేరం రుజువుకావడంతో నేరస్తుడు లావుడ్యా శ్రీనుకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలాగీతాంబ తీర్పు వెల్లడించారు. కేసును ఏసీపీ ఆదినారాయణ, సీఐ సూర్యప్రకాశ్ పరిశోధించగా ఎస్సై వెంకటస్వామి పర్యవేక్షణలో హెచ్‌సీ సోమునాయక్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

'తొలిఏకాదశి'.. సర్వశ్రేష్ఠం


కొడవటూరు సిద్ధులగుట్ట


బీరప్ప కామరతి, మహంకాళి దేవతామూర్తులు


బీరప్ప ఆలయం

నేడు పర్వదినం ప్రారంభం

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- చాతుర్మాస వ్రతాలు షురూ
- ముస్తాబవుతున్న శివ, విష్ణు ఆలయాలు
- పండుగలకు స్వాగతం

జనగామ: శివకేశవులు, విష్ణువుకు ప్రీతికరమైన రోజు.. ఉపవాసాలు, వ్రతాలు ప్రారంభమయ్యే శుభదినం.. పండుగలకు స్వాగతం పలికే రోజు 'తొలి ఏకాదశి'. ఆషాఢ మాసంలో వచ్చే శుక్లపక్ష ఏకాదశిని 'తొలిఏకాదశి' అంటారు. దీనినే 'శయన ఏకాదశి' అని కూడా పిలుస్తారు. ఉత్తర దిక్కున ఉన్న సూర్యుడు ఈరోజు నుంచి దక్షిణ దిక్కున ప్రయాణించడం వల్ల దీనిని దక్షిణాయణంగా పరిగణిస్తారు. అందుకే శివకేశవులు.. విష్ణువుకు ఈరోజు ప్రీతికరమైనదిగా భావిస్తారు. నేటి బుధవారం తొలిఏకాదశి సందర్భంగా శివ, వైష్ణవాలయాలను ముస్తాబు చేస్తున్నారు. ఆదిశేషుడి వాహనం కలిగిన నారాయణుడిని లక్ష్మి సమేతంగా పూజ చేయడం వల్ల సకల శ్రేయస్సు కలుగుతుంది. ఈరోజు ఉపవాసాలు, శివనామస్మరణ, విష్ణు సహస్రనామ పారాయణం చేయడం సర్వశ్రేష్ఠం. తొలిఏకాదశి రోజున విష్ణు నామస్మరణ చేసే వారికి వైకుంఠ ప్రాప్తి కూడా కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు విష్ణువు యోగ నిద్రలో ఉంటాడు. చాతుర్మాస్యం ఈరోజు నుంచే మొదలవుతుంది. అందుకే ఈ నాలుగు మాసాలు ధర్మాచరణ కలిగి విష్ణు ప్రీతికై వ్రతాలు చేయడం నారాయణ అనుగ్రహం కలుగుతుందని భక్తుల విశ్వాసం. నాలుగు మాసాల్లో వచ్చే ఏకాదశులకు ఇది మొదటిది కావడంతో 'తొలిఏకాదశి' అని పిలుస్తారు. తొలిఏకాదశి రోజున నదీ స్నానం పవిత్రమైనదిగా భావిస్తారు.

మూడు రోజుల పాటు వ్రతం..

ఈ ఏకాదశి వ్రతం మూడు రోజులు చేయాలి. రోజు శేషశాయిని అర్చించడం, ఏకాదశి పర్వదినం రోజున ఉపవాసం, ద్వాదశి పారాయణం, త్రయోదశి రోజున గీత నృత్యాదులతో అర్చన చేయాలి. చాతుర్మాస్య వ్రతం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ వ్రతం చేయాలనుకునే భక్తులు మొదటి రోజు నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు నాలుగు నెలల పాటు నిష్ఠతో స్వామికి పూజలు చేయాల్సి ఉంటుంది. పరమాత్ముడికి బెల్లం, తైలం, విడిచి పెడతామని సంకల్పించుకోవాలి. దేవుడికి నివేదన చేయని ఆహారం, పుచ్చకాయ, కాల్చి వండినవి, గుమ్మడికాయ, చెరకు, కొత్త ఉసిరిక, చింతపండు, మంచంపై పడుకోవడం, పరాన్నం, తేనె, పొట్లకాయ, ఉలవలు, తెల్ల ఆవాలు, మినుములు ఈ నాలుగు నెలల పాటు వినియోగించకుండా నిష్ఠతో భగవంతుడి సేవలో నిమగ్నం కావాలి. చాతుర్మాస్య వ్రతాలు, పూజలు చేసిన భక్తులకు దేవతల ఆశీస్సులు దక్కుతాయని భక్తుల విశ్వాసం.

ముస్తాబవుతున్న ఆలయాలు

తొలి ఏకాదశి సందర్భంగా జనగామ జిల్లాలోని పాలకుర్తి శ్రీ సోమేశ్వరాలయం, బచ్చన్నపేట మండలం కొడవటూరు సిద్ధేశ్వరాలయం, జనగామ బాణాపురం శ్రీవెంకటేశ్వరాలయం, పాతబీటు శ్రీరామలింగేశ్వరాలయం, శ్రీసంతోషిమాత ఆలయం, చిల్పూరు శ్రీ వెంకటేశ్వ రాలయాలను సుందరంగా అలంకరిస్తున్నారు. తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజాము నుంచి ఆలయాలకు వేలాది మంది భక్తులు తరలిరానున్నారు.

నేడు కురుమ కులస్తుల బోనాలు

తొలి ఏకాదశి సందర్భంగా నేడు జనగామ పట్టణంలో కురుమ కులస్తులు బీరప్ప కామరతి, అక్క మహంకాళి దేవతామూర్తులకు బోనాలు సమర్పించనున్నారు. కుర్మవాడ నుంచి నెహ్రూపార్కు మీదుగా ఒగ్గుడోలు కళాకారుల వాయిద్యాలు.. శివసత్తుల నృత్యాలు.. పోతరాజుల విన్యాసాల మధ్య వేలాది మంది మహిళలు బోనాలతో పాటు పట్టువస్త్రాలతో బీరప్ప ఆలయానికి చేరుకుంటారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, బోనం నైవేద్యం సమర్పించిన అనంతరం, పట్టువస్త్రాలు కానుకగా ఇచ్చి ఒడిబియ్యం పోస్తారు. ఇందుకు సంబంధించి ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తుండగా, పోలీసులు కట్టుదిట్ట చర్యలు చేపడుతున్నారు.

ఆధ్యాత్మికం

మొహర్రం.. వీరత్వానికి ప్రతీక

నేడు మధ్యకోటలో వేడుకలు

- సాయంత్రం 5గంటలకు భారీ ఊరేగింపు
- 200 ఏళ్ల చరిత్ర గల మధ్యకోట పీరీలు
- పీరీల బావి, చావడీల్లో ముమ్మర ఏర్పాట్లు
- మతాలకతీతంగా పీరీలను దర్శించుకోనున్న భక్తులు


పీరీలను నిమజ్జనానికి తరలిస్తున్న ముస్లింలు (ఫైల్)

ఖిలా వరంగల్: మొహర్రం.. వీర మరణానికి ప్రతీక. ధర్మ రక్షణ కోసం కర్బలా మైదానంలో విరోచితంగా పోరాడి వీరమరణం పొందిన వారికి గుర్తుగా మొహర్రం ఉత్సవాలు పీరీలను (సంతాప దినాలు) పది రోజులపాటు ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయ రాజధాని ఖిలావరంగల్ కోట పీరీలకు సుమారు 200 ఏళ్ల ఘన చరిత్ర ఉంది . ఏటా పదో రోజు మొహర్రం పీరీల ఊరేగింపుల్లో వేలాది మంది కులమతాలకతీతంగా పాల్గొంటారు. ఈ పీరీలను దర్శిస్తే కష్టాలు తొలగి కోరికలు సిద్ధిస్తాయన్న నమ్మకం. ముస్లింలు తమ ఆరాధ్యదైవంగా భావించే పీరీలను హిందువులు కూడా పూజిస్తారు. మొహర్రం సంతాప దినాల్లో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల ముస్లింలు కూడా ఇక్కడకు చేరుకుని దర్శించుకుంటారు.

మొహర్రం వేడుకలకు సర్వం సిద్ధం..

మధ్యకోట.. బుధవారం జరగనున్న మొహర్రం వేడుకలకు ముస్తాబైంది. ఉదయం 4 గంటల నుంచే పీరీలకు ప్రత్యేక ప్రార్థనలు, సాయంత్రం 5గంటలకు వేలాది ముస్లింల మధ్య భారీ ఊరేగింపు సాగనుంది. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు అధికారులు, ముస్లిం మతపెద్దలు పూర్తి చేశారు. చావడిల్లో నెలకొల్పిన పీరీలకు 200ఏళ్ల ఘన చరిత్ర ఉంది. ఇక్కడి హస్సేన్, హుస్సేన్ పీరీలను దర్శిస్తే కష్టాలు తొలగి కోరికలు సిద్ధిస్తాయన్న నమ్మకం ఉంది. పీరీల ముజవార్ల పర్యవేక్షణ, మొహర్రం కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులు పీరీలను దర్శించుకుని ఊరేగింపులో పాల్గొంటారు. ఇప్పటికే పీరీలను రంగుల వస్త్రాలతో అలంకరించారు. తమ కోరికలు తీరిన వాళ్లు పీరీలకు వెండి, బంగారం, గొడుగులు, ఉయ్యాలలు, దట్టీలు సమర్పించనున్నారు.

పీరీల బావి వద్ద ఏర్పాట్లు పూర్తి

మధ్యకోట నుంచి పీరీలు భారీ ఊరేగింపుతో ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ సమీపంలోని కాశికుంట పీరీల బావి వద్దకు రాత్రి 12గంటలలోపు చేరుకుంటాయి. ఇక్కడ ముస్లిం మతపెద్దలు భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేస్తారు. మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గ్యాంగ్ వర్క్ నిర్వహించారు. ఈ పనులను స్థానిక కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమ, పోశాల పద్మ, సిద్ధం రాజు పరిశీలించారు.

భారీ బందోబస్తు ఏర్పాటు



త్యాగానికి ప్రతీకైన మొహర్రం ఊరేగింపునకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తాం. సెంట్రల్‌జోన్ డీసీపీ సలీమా మధ్యకోట పీరీల చావడీలను సందర్శించి ఊరేగింపు కొనసాగనున్న రహదారులను క్షుణ్ణంగా పరిశీలించి భద్రతా పరమైన ఆదేశాలు ఇచ్చారు. డీసీపీ ఆదేశాల ప్రకారం ఊరేగింపు పరిసరాల్లో ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా చర్యలు తీసుకుంటాం.

-నందిరామ్‌నాయక్, ఏసీపీ వరంగల్

పాత కక్షలే.. ప్రాణం తీశాయి

- వివరాలు వెల్లడించిన డీసీపీ రాజమహేంద్రనాయక్
- మాజీ సర్పంచ్ దేవేందర్ హత్యకేసులో వీడిన మిస్టరీ


మాట్లాడుతున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

రాయపర్తి : పాత కక్షలతోనే బురహాన్‌పల్లి మాజీ సర్పంచ్ దేవేందర్‌ను ప్రత్యర్థులు హత్య చేసినట్లు జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ వెల్లడించారు. మంగళవారం రాయపర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అయన తెలిపిన వివరాల ప్రకారం.. రాయపర్తి మండలం బురహాన్‌పల్లి మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్ ఈనెల 7న సొంతింట్లో హత్యకు గురైన విషయం విధితమే. అయితే అదే గ్రామానికి చెందిన ఎనబోతుల ప్రకాశ్ నుంచి దేవేందర్ బయానా ఇచ్చి మూడెకరాల భూమిని కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో డబ్బులు చెల్లించకపోడంతో పల్లె మల్లేశ్‌కు అదే భూమిని విక్రయించాడు. కాగా తాను కొన్న భూమిని నువ్వెలా కొంటావని పల్లె మలేశ్‌తో దేవేందర్‌కు రెండేళ్ల కింద భూ వివాదం తలెత్తింది. దీంతో గొడవలు కాగా దేవేందర్‌తో సహా పలువురిపై కేసు నమోదైంది. గత కొద్దికాలం క్రితం పల్లె మల్లేశ్ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. అది మాజీ సర్పంచే చేయించాడని అతడిని హతమార్చాలని పథకం పన్నాడు. ఈనెల 7న దేవేందర్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడని తెలుసుకున్న పల్లె మల్లేశ్ తన కుమారుడు మురళితో పాటు చెన్ననాయుడు, గోవింద్ మరికొందరితో కలిసి దేవేందర్ తలపై హ్యామర్‌తో కొట్టాడు. అక్కడే ఉన్న సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్, మొబైల్‌ను తీసుకుని వెళ్లిపోయారు. పోలీసులు వెతుకుతున్నట్లు గమనించిన పల్లె మల్లేశ్, చెన్ననాయుడు, గోవింద్ మంగళవారం లొంగిపోయారు. పరారీలో ఉన్న పల్లె మురళి, అతడితో ఉన్న మరికొందరికోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ సమావేశంలో ఏసీపీ నర్సయ్య, సీఐ సూర్యప్రకాశ్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం పోసి.. మట్టుబెట్టి

- యువకుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ సర్వయ్య

కేసముద్రం: మండల కేంద్రంలో ఈనెల14వ తేదీన జరిగిన యువకుడి హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. మంగళవారం కేసముద్రం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కేసముద్రంవిలేజ్ చైతన్యనగర్‌కాలనీలో ఉంటున్న జిలుకర నాగరాజుపై ఇదే గ్రామం జ్యోతిరావు పూలే సెంటర్ సమీపంలో నివాసముండే వల్లందాసు నగేశ్ కొంతకాలంగా వ్యక్తిగతంగా కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో నాగరాజును ఎలాగైనా మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా నాగరాజును నమ్మించేందుకు నగేశ్ చిన్న పనులు చెబుతూ హత్య చేయాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఈ క్రమంలో నగేశ్ భార్య ఉమ అనారోగ్యానికి గురవడంతో ఇటీవల నెల్లికుదురు మండలం బొడ్లాడలోని తన పుట్టింటికి వెళ్లింది. దీంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న నగేశ్ ఇదే అదునుగా భావించాడు. ఈ నెల 14న నాగరాజును నమ్మించి తన ఇంటికి రప్పించుకున్నాడు. మద్యం తీసుకరమ్మని డబ్బులు ఇవ్వడంతో నాగరాజు తీసుకువచ్చాడు. ఈ క్రమంలో నగేశ్ అన్నం తింటూ నాగరాజుకు మద్యం పోస్తూ వచ్చాడు. మద్యం సేవించిన నాగరాజు మత్తులో మునిగిపోవడంతో అతడి మెడపై కర్రతో కొట్టగా కిందపడ్డాడు. వెంటనే అపస్మారకస్థితిలో ఉన్న నాగరాజు గొంతుపై కాలితో తొక్కి చంపేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టి నిందితుడు వల్లందాసు నగేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు.

వ్యవసాయ రంగాల అభివృద్ధే లక్ష్యం

- కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాజన్న


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజన్న

మామునూరు: వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల అభివృద్ధే పరిశోధన స్థానం లక్ష్యమని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న అన్నారు. ఈమేరకు మంగళవారం ఖిలా వరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి 96వ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాల ఉత్పత్తిలో ప్రపంచంలో భారత్ ప్రథమ స్థానంలో, చేపల పెంపకంలో రెండో స్థానంలో ఉందన్నారు. వ్యవసాయ రంగం, ఉద్యాన పంటల్లో గణనీయమైన ప్రగతి సాధించామని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం, నూతన విధానాలతో వ్యవసాయ, వ్యవసాయ రంగాల అభివృద్ధి విషయంలో ముందుకు దూసుకెళ్తోందన్నారు. కృషి విజ్ఞానం కేంద్రంలోని సేవలను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. అనంతరం రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవస్థాపక దినోత్సవం వేడుకలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజు, శశాంక్, సాయి కిరణ్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా బైక్ దొంగల అరెస్ట్

- రూ. 8 లక్షల విలువైన పది ద్విచక్రవాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మడికొండ సీఐ ప్రతాప్


బైక్‌ల చోరీకి పాల్పడుతున్న వారి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మడికొండ : ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్‌జిల్లా దొంగలను మడికొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు మంగళవారం మడికొండ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ప్రతాప్ వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా జెన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన సంపెంగి రమేశ్ డ్రైవర్ పని చేస్తూ వచ్చిన ఆదాయంతో జల్సా చేసేవాడు. అయితే జల్సాలకు ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా తన స్నేహితుడు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రేలకుంట గ్రామానికి చెందిన వాంకుడోత్ రాకేశ్‌తో కలిసి ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడడం ప్రారంభించారు. ఇందులో భాగంగా జగిత్యాల, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో పలుమార్లు ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడగా పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలైన అనంతరం మార్పు రాక పోగా మరోసారి చోరీలకు సిద్ధపడి హైదరాబాద్‌తోపాటు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని మడికొండ, ఇంతేజార్‌గంజ్, పోలీసు స్టేషన్ల పరిధిలో ద్విచక్రవాహన చోరీలకు పాల్పడ్డారు. ఈ చోరీలపై అప్రమత్తమైన మడికొండ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం మడికొండ సెంటర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. రమేశ్ వాహనంపై వస్తుండగా అనుమానం కలిగి తనిఖీ చేయగా వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు లేకపోవడంతో అదుపులోకి తీసుకుని విచారించగా తన నేరాలను అంగీకరించాడు. అనంతరం నిందితుడి సమాచారం మేరకు మరో నిందితుడు రాకేశ్‌ను అదుపులోకి తీసుకుని అతడి ఇంటి వద్ద నుంచి తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రతాప్ తెలిపారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన మడికొండ ఎస్సైలు రాజాబాబు, దివ్య, ఏఎస్సై రమేష్, ఏఎఓ సల్మాన్ పాషా, హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర, రామ్‌నాథం, జంపయ్య, కానిస్టేబుళ్లు రవి, నాగేశ్వర్, ఐటీ కోర్ కమిటీ సభ్యులు నాగేష్, ప్రవీణ్‌ను సీఐ ప్రతాప్ అభినందించారు.

అద్దంకి దయాకర్‌కు సముచిత స్థానం కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

హన్మకొండ : తెలంగాణ ఉద్యమ నాయకుడు అద్దంకి దయాకర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ కోరారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలో జాతీయ మాల మహానాడు వరంగల్, హనుమకొండ జిల్లాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే టికెట్ త్యాగం చేసిన ఉద్యమ నాయకుడు అద్దంకి దయాకర్ అన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కేయూ పాలక మండలిలో మాల సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక భూమిక పోషించిన మాలలకు నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జాతీయ మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నే బాబురావు, కార్యదర్శి అశోద భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మేడి అంజయ్య, వెన్న రాజు, మాల సాంస్కృతిక విభాగం కన్వీనర్ ఎలుక దేవయ్య, రాష్ట్ర కార్యదర్శి సాంబయ్య, జై భీమ్ సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ అసాది పురుషోత్తం, వరంగల్ మహా నగర అధ్యక్షుడు అంకేశ్వరపు రామచందర్, నాయకులు పాల్గొన్నారు.

డీఎస్సీకి ఏర్పాట్లు పూర్తి..

- రేపటి నుంచి ఆగస్టు 5 వరకు పరీక్ష
- ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఐదు కేంద్రాలు
- 27,741మంది అభ్యర్థులు
- నిర్దేశించిన సమయానికి 10 నిమిషాల ముందుగానే గేట్లు మూసివేత

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల నియామకానికి టీజీడీఎస్సీ పరీక్ష నిర్వహించేందుకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేసింది. ఈ నెల 18 నుంచి (రేపు) ఆగస్టు 5వ తేదీ వరకు ఈ పరీక్ష నిర్వహించబోతున్నారు. రోజూ రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. ఇప్పటికే అభ్యర్థులకు సంబంధిత వెబ్‌సైట్ హాల్ టికెట్లను కూడా అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో ఐదు పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌పద్ధతిలో కంప్యూటర్ బేస్డ్(సీబీటీ) పరీక్ష నిర్వహించబోతున్నారు. ఐదు పరీక్షకేంద్రాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని జయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌టెక్నాలజీ అండ్ సైన్స్, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కిషన్ పుర, హసన్‌పర్తిలోని నోబుల్‌టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్, హసన్‌పర్తి ఎర్రగట్టుగుట్టవద్ద ఉన్న అయాన్ డిజిటల్ జోన్, భీమారం సమీపంలోని పొద్దుటూరి గార్డెన్ దగ్గరలోని మోక్షిత కంప్యూటర్స్ పరీక్ష కేంద్రాలుగా ఉన్నాయి. ప్రతీ పరీక్ష కేంద్రానికి ఒక్కో అబ్జర్వర్‌ను నియమించారు. పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించి పరిశీలించనున్నారు.13 రోజులపాటు రోజూ రెండు సెషన్లలో పరీక్షలు జరగుతాయని సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది. రోజూ ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే పరీక్షలకు అభ్యర్థులు రెండుగంటల ముందునుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిర్దేశించిన పరీక్ష సమయం ఉదయం 9 గంటలుకాగా 10 నిమిషాలు ముందుగానే ఉదయం 8.50 గంటలకే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారు. ఆ తరువాత అభ్యర్థులకు లోపలికి అనుమతించరు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి జరిగే పరీక్షలకు కూడా రెండు గంటల ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సింటుంది. మధ్యాహ్నం 01.50 గంటలకే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారు. ఆ తరువాత వచ్చేవారిని లోపలికి అనుమతించరు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లాక బయోమెట్రిక్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు తమ హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డును (ఐడింటిటీకార్డును) తీసుకుని రావాల్సింటుంది. ఐదుపరీక్ష కేంద్రాల్లో కలిపి మొత్తం 27,741మంది అభ్యర్థులు టీజీడీఎస్సీని రాయబోతున్నారు. స్కూల్ అసిస్టెంట్లు నియామకానికి ఎస్‌జీటీ తత్సమాన కేడర్‌లో టీచర్ల నియామకానికి ఈడీఎస్సీ నిర్వహించబోతున్నారు.పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావొద్దు. రాష్ట్రంలో మొత్తం 2.79 లక్షల మంది అభ్యర్థులు పరీక్షలు రాయబోతున్నారు.

వ్యవసాయ అనుబంధ రుణాలు పెంచాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రవీందర్ రావు

హన్మకొండ : బ్యాంకులు వ్యవసాయ అనుబంధ రంగ పరిశ్రమలకు రుణాలు పెంచాలని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు సూచించారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) ఆధ్వర్యంలో వాణిజ్య, గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల బ్రాంచ్‌ల అధికారుల జోనల్ వర్క్ షాప్ ఆన్ బిజినెస్ అపార్చునిటీస్ ఫామ్ సెక్టార్, నాన్ ఫామ్ సెక్టార్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును రవీందర్ రావు ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి నాబార్డు రూ.460 కోట్లు రుణాలు మంజూరు చేసిందన్నారు. నాబార్డు జీఎం ఉష మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగ పరిశ్రమలను ప్రోత్సహించడానికి నాబార్డు రాయితీ అందిస్తోందన్నారు. డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి వజీర్ సుల్తాన్, ఫౌల్ట్రీ ఫామ్స్ అధ్యక్షుడు ధర్మారావు, నాబార్డు డీడీఎం రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.